సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం : 12 : ఏప్రిల్ : 2024



టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 219 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
41.8°/21.7°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం నెలకొంది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య



అధికారులతో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే అక్రమ మద్యం ప్రత్యేక నిఘా పెట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి జిల్లా సెబ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందిలో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం సరఫరా చేసే మార్గాలలో రూట్ వాచ్‌లను నిర్వహించి వాహనాల తనిఖీలు చేపట్టి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా కాకుండా చూడాలన్నారు. అక్రమ మద్యం దంపులపై కూడా నిఘా ఉంచాలన్నారు. విధుల్లో ఏమాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళికి లోబడి ఎలాంటి రాజకీయ నాయకులకు ఒత్తిళ్లకు తలొగ్గకుండా అప్రమత్తంగా ఉండి ఎన్నికలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్రమణ్యం, జిల్లా సెబ్ అధికారి సహదేవ, సెబ్ ఇన్‌స్పెక్టర్లు కన్నయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమా.. మము గనుమా

- కనుల పండువగా మురడి అంజన్న రథోత్సవం



భక్తజనం నడుమ సాగుతున్న రథోత్సవం

రాయదుర్గం: డీ హీరేహాళ్ మండలంలోని మురడిలో గురువారం ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామికి వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అధిష్టింపజేశారు. ఈఓ నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు నారికేళాలు సమర్పించి ఉత్సవం ప్రారంభించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హనుమా మము గనుమా అంటూ దివ్య స్వరూపుడి దర్శనం చేసుకుని తరించారు. రథం ముందు యువకులు నందికోలు నాట్యం, కోలాటం, చెక్కభజనలతో ఆకట్టుకున్నారు. మహిళలు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాత్రి 7 గంటలకు లంకా దహనం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

జాతీయస్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన చందుప్రియబాయి



జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి సీనియర్స్ విభాగంలో జంప్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. పాఠశాల ఎస్‌ఓ సునీత కుమారి మాట్లాడుతూ ... మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకూ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థినులు చందుప్రియబాయి, ఎస్.రిస్సీ, టి.గిరిజ బంగారు పతకాలు సాధించారన్నారు. ఇందులో చందుప్రియబాయి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో జపాన్ రాజధాని టోక్యోలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎస్‌ఓ, ఉపాధ్యాయులు అభినందించారు.



కదిరి: ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హిందూపురం: ఈద్ ముబారక్ చెప్పకుంటున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆనందోత్సాహాలతో వివిధ ప్రాంతాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదులు, దర్గాల్లో పోటెత్తిన జనంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మతపెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగంలో రంజాన్ విశిష్టతను తెలియజేశారు. రంజాన్ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళాభ్యుదయం

- వైఎస్సార్‌సీపీతోనే చట్టసభలు, నామినేటెడ్ పోస్టుల్లో పెద్దపీట
- సగానికి పైగా సీట్లు మహిళలకే కేటాయింపు
- అందులో చాలా మంది బీసీ, ఎస్సీ, మైనార్టీలే
- మహిళలను చులకనగా చూస్తున్న టీడీపీ పెద్దలు
- వైఎస్సార్‌సీపీలో మగాళ్లు లేక మహిళలకు సీట్లు ఇస్తున్నారన్న బీకే పార్థసారథి
- పార్థసారథి వ్యాఖ్యలపై మహిళల ధ్వజం



"వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం చేసే మగాళ్లు లేరు... అందుకే చాలా చోట్ల మహిళలకు టికెట్లు ఇస్తున్నారు'' ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి. ఆయన మాటలను చూస్తేనే అర్థం చేసుకోవచ్చు.. ఆ పార్టీలో మహిళలకు ఏమాత్రం గౌరవం ఉందో. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తుండటంతో జీర్ణించుకోలేని టీడీపీ పెద్దలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. హిందూపురం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలపై మహిళలు, పలువురు ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

సాక్షి, పుట్టపర్తి: గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు, మహిళా అధికారులపై దురుసు ప్రవర్తన, దాడులను ఇంకా ఎవరూ మర్చిపోలేదు. మంత్రుల స్థాయి నుంచి వార్డు సభ్యుడు స్థాయి వరకు టీడీపీలో మహిళలపై చిన్నచూపు చూసే వాళ్లు ఉన్నారన్న విమర్శలున్నాయి. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా రాజకీయ చైతన్యం లేని కుటుంబాలను సైతం పైకి తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు పలు నామినేటెడ్ పదవులు మహిళలకు ఇచ్చి.. పురుషులతో సమానంగా గౌరవం ఇస్తోంది. అందులోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలే అధికంగా ఉండటం విశేషం. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో బీసీ కులాలకు చెందిన శాంతమ్మ (పార్లమెంటు అభ్యర్థి), దీపిక (హిందూపురం అసెంబ్లీ), ఉషశ్రీచరణ్ (పెనుకొండ అసెంబ్లీ) పోటీ చేసేందుకు వైఎస్సార్‌సీపీ అవకాశం కల్పించింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా...

- ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా బోయ గిరిజమ్మ కొనసాగుతున్నారు.
- కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆరుగురు మహిళలు జెడ్పీటీసీ సభ్యులుగా ఉన్నారు. తనకల్లు ఎంపీపీగా మహిళే కొనసాగుతున్నారు. అలాగే కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మహిళ ఉండటంతో పాటు మరో 18 మంది మహిళలు కౌన్సిలర్లుగా కొనసాగుతున్నారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాలుగు చోట్ల మహిళలు జెడ్పీటీసీ సభ్యులుగా ఉన్నారు. మూడు మండలాల్లో ఎంపీపీలుగా మహిళలు ఉన్నారు.
- హిందూపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఎంపీపీలుగా మహిళలే ఉన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మహిళ కొనసాగుతున్నారు. మరో 14 స్థానాల్లో మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.
- మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ముగ్గురు జెడ్పీటీసీ సభ్యులు, ఇద్దరు ఎంపీపీలుగా మహిళలు ఉన్నారు. మడకశిర మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కూడా మహిళకే అవకాశం ఇచ్చారు.
- పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నాలుగు చోట్ల మహిళలే ఎంపీపీలుగా ఉన్నారు. మరో స్థానంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. మున్సిపాలిటీలో 10 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.
- ధర్మవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగు చోట్ల ఎంపీపీలుగా మహిళలు ఉన్నారు. మరో రెండు చోట్ల జెడ్పీటీసీ సభ్యురాలిగా మహిళకు అవకాశం ఇచ్చారు. ధర్మవరం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మహిళ కొనసాగుతున్నారు. మరో 21 స్థానాల్లో మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.
- రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంపీపీలుగా మహిళలు ఉండటం విశేషం.

సగానికి పైగా మహిళలకే..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మహిళలకు పెద్దపీట వేశారు. జిల్లాలో 32 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో నాలుగు మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్లుగా మహిళలు కొనసాగుతున్నారు. అదేవిధంగా 20 మండలాల్లో ఎంపీపీలుగా మహిళలు ఉన్నారు. మరో 16 మండలాల్లో జెడ్పీటీసీ సభ్యులుగా మహిళలకు అవకాశం ఇచ్చారు. అంతేకాకుండా వైస్ చైర్మన్లు, వార్డు సభ్యులు, వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా చాలామంది మహిళలకు పదవులు ఇచ్చి వైఎస్సార్‌సీపీ సమన్యాయం చేసింది.

టీడీపీలో కేవలం ఒకరిద్దరికే..

గత 2004 ఎన్నికల నుంచి హిందూపురం పార్లమెంటు రాజకీయాలను పరిశీలిస్తే.. కేవలం గోనుగుంట్ల జయమ్మ, పరిటాల సునీత మాత్రమే చట్టసభలకు పోటీ చేశారు. మరెవరికీ టీడీపీ అవకాశం ఇవ్వలేదు. రానున్న ఎన్నికల్లో పరిటాల సునీతతో పాటు సవితకు అవకాశం ఇచ్చారు. 2019లో ఒక్క మహిళకు కూడా టీడీపీ టికెట్ ఇవ్వలేదు. అలాగే 2009, 2014లో కూడా పరిటాల సునీతకు మాత్రమే టికెట్ ఇచ్చారు. టీడీపీలో కేవలం పెత్తందార్లకే పెత్తనం కట్టబెడుతున్నారనేందుకు ఇదే నిదర్శనమన్న విమర్శలున్నాయి. తాజాగా బీకే చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

జగన్ వచ్చాకే గౌరవం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మహిళలకు సరైన గౌరవం లభించింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వనన్ని పదవులు మహిళలకు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే. గ్రామస్థాయిలో ఉన్న మా కుటుంబం.. వైఎస్సార్‌సీపీతోనే రాజకీయంగా ఎదిగిందని గర్వంగా చెబుతున్నాం.

– లక్ష్మీనరసమ్మ, పుడా చైర్‌పర్సన్

జగనన్నతోనే మహిళలకు న్యాయం



చంద్రబాబు హయాంలో ఏనాడూ మహిళలకు సరైన పదవులు ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేశారు. జనరల్ స్థానాల్లోనూ మహిళలు అవకాశం ఇచ్చారు. వైఎస్ జగన్‌తోనే మహిళలకు న్యాయం జరుగుతోంది.

– పరిగి నజీమున్నీసా, చైర్‌పర్సన్, కదిరి మున్సిపాలిటీ

టీడీపీలో మహిళలకు గౌరవం లేదు



హిందూపురం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. టీడీపీలో మహిళలకు గౌరవం లేదు. మహిళా లోకం స్పందించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలి. గతంలో చింతమనేని ప్రభాకర్ మహిళా అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించారు.

– త్రివేణి , ఎంపీపీ, బత్తలపల్లి

బీకేకి మతిభ్రమించింది



గత ఎన్నికల్లో ఓడిపోయాక బీకేతో పాటు టీడీపీ నేతలకు మతిభ్రమించింది. రానున్న ఎన్నికల్లోనూ ఓటమి భయం పట్టుకుని ఏదేదో మాట్లాడుతున్నారు. మహిళలను గౌరవించడం చేతకాని టీడీపీ.. విమర్శలు చేయడం సరికాదు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని చిత్తుచిత్తుగా ఓడించాలి.

– ఉషశ్రీ చరణ్, మంత్రి

అనంతపురం పెద్దాస్పత్రిలో అందుబాటులోకి 'అపేరిసిస్'

- సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ ఉచితంగా అందించే అవకాశం
- ప్రైవేటుగా ఈ సేవ పొందాలంటే రూ.11వేల నుంచి రూ.14 వేల ఖర్చు



అపేరిసిస్ పరికరం

అనంతపురం మెడికల్: వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే అనంతపురం సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో 'అపేరిసిస్' పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఉపయోగమిదే...

డెంగీ, మలేరియా, హై బీపీ తదితర సమస్యలున్న వారిలో ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ అమాంతంగా పడిపోతాయి. అలాంటి వారికి సాధారణ ప్లేట్ లెట్స్ నాలుగు యూనిట్లు ఎక్కిస్తే 40 వేల నుంచి 50 వేల ప్లేట్‌లెట్స్ పెరిగే అవకాశం ఉంటుంది. అదే సింగిల్ డోనల్ ప్లేట్‌లెట్స్ ఒక్క యూనిట్ ద్వారా అదే స్థాయిలో ప్లేట్‌లెట్స్ పెరిగే అవకాశం ఉంటుంది. అపేరిసిస్ పరికరం ద్వారానే ఈ సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ అందించాల్సి ఉంటుంది. గతంలో ఈ పరికరం లేక రోగులు ప్రైవేటుగా సేవలు పొందాల్సి వచ్చేది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇందుకు రూ.8,000 ఖర్చవుతుండగా, ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అయితే రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకూ సమర్పించుకోవాల్సి వచ్చేది. అయితే, పేదలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. అందులో భాగంగానే పెద్దాస్పత్రిలో రూ.24 లక్షలు విలువ చేసే అపేరిసిస్ పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రోగులపై ఎలాంటి భారం పడకుండా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ ఉచితంగా అందించనుంది. ప్రైవేటు ఆస్పత్రుల వారికి కూడా తక్కువ ధరకే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ అందిస్తారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సూచించారు.

వారం రోజుల్లో నామినేషన్లు

- 18 నుంచి 25 వరకూ నామినేషన్ల పర్వం
- 29 సాయంత్రం వరకూ విత్‌డ్రాకు గడువు
- ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకుంటున్న అభ్యర్థులు



పార్లమెంట్ అభ్యర్థులు నామినేషన్ వేసే కలెక్టరేట్

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మరో వారం రోజుల్లో నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్ల దాఖలు చేయవచ్చు.

ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్లకు అవకాశం

అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు ఆయా ఆర్‌ఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేయాలి. పార్లమెంట్ అభ్యర్థులు కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ ప్రతి అంశాన్ని పక్కాగా పరిశీలించనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతో కొందరు అభ్యర్థులు డమ్మీ సెట్ దాఖలు చేయనున్నారు. మొత్తమ్మీద ఒక అభ్యర్థి నాలుగు సెట్లు నామినేషన్లు దాఖలు చేయడానికి వీలుంది.

ఎంపీ అభ్యర్థికి రూ.25 వేలు, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.10 వేలు..

పార్లమెంట్ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసే సాధారణ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 ధరావత్తు చెల్లించాలి. ఇక అసెంబ్లీకి పోటీ చేసే సాధారణ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల చొప్పున ధరావత్తు చెల్లించాలి. అసెంబ్లీ అభ్యర్థులు ఫారం 2బిలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉండగా... పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే వారు ఫారం 2ఏ-ఏలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ఫారాన్ని నామినేషన్ రోజు సాయంత్రం 3 గంటల్లోపు అందజేయాలి. ఎన్నికల్లో 'సువిధ' యాప్‌లో దాఖలు చేసిన అనంతరం హార్డుకాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులకు మాత్రమే ఛాంబర్‌లోకి అనుమతిస్తారు.

నామినేషన్ల పరిశీలన..

అసెంబ్లీ, పార్లమెంట్‌కు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను 26వ తేదీ శుక్రవారం సాయంత్రం వరకూ పరిశీలిస్తారు. సరైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లు అదే రోజు ప్రకటిస్తారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఏదైన అనివార్య కారణాలతో తమ నామినేషన్ ఉపసంహరించుకునేందుకు ఈనెల 29 సాయంత్రం వరకూ గడువు ఉంటుంది. ఇక మే నెల 13వ తేదీ సోమవారం పోలింగ్ ఉంటుంది. ఉదయం 7 గంటల నుండి క్యూలో ఉన్న ఓటర్లు మొత్తం ఓటు వేసే వరకూ సమయం ఉంటుంది. అంతకు ముందు రోజు ఆయా నియోజక వర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అధికారులు పోలింగ్ సామగ్రిని ప్రత్యేక బందోబస్తు మధ్య బస్సుల్లో తరలిస్తారు. జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తానికి జూన్ 6వ తేదీ నాటికి ఎన్నికల కోడ్ ముగుస్తుంది.

నేడు ఇంటర్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల
- తొలిసారి 23 రోజుల్లోనే ఫలితాలు
- ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలు ప్రకటన



సాక్షి, పుట్టపర్తి : ఇంటర్ వార్షిక పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులు, కళాశాలల యాజమాన్యాల ఉత్కంఠకు నేటితో తెర పడనుంది. ఇంటర్ బోర్డు చరిత్రలోనే తొలిసారి పరీక్షలు ముగిసిన కేవలం 23 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేస్తోందని అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు చెబుతున్నారు. ఇదొక రికార్డ్‌గా అభివర్ణిస్తున్నారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఒకే మారు విడుదల చేయనున్నట్లు ఇంటర్ విద్యామండలి ప్రకటించింది.

జిల్లాలో పరీక్షలు రాసిన 20,091 మంది

శ్రీసత్యసాయి జిల్లా నుంచి రెగ్యులర్, ఒకేషనల్ వార్షిక పరీక్షలు 20, 091 మంది రాశారు. వీరిలో 11,528 మంది మొదటి సంవత్సరం, 8,563 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. మార్చి 21 నుంచి మూల్యాంకనం ప్రారంభం కాగా ఈనెల 4 నాటికి పూర్తయింది.

పకడ్బందీగా నిర్వహణ..

ఇంటర్ వార్షిక పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణ విధానంపై పటిష్ట నిఘా ఉంచారు. తాడేపల్లిలోని బోర్డు కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించారు. టెక్నాలజీ సాయంతో పరీక్ష పత్రాలు లీక్ కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రశ్నపత్రాలకు మూడు స్థాయిల్లో 'క్యూఆర్' కోడ్‌ను జోడించి లీకేజీలకు అడ్డుకట్ట వేశారు. ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ నమోదు నుంచి ఎగ్జామ్ సెంటర్ల వరకు అన్ని దశల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని బోర్డు వినియోగించింది. గతంలో ఇంటర్ పరీక్ష ఫీజు చలానా రూపంలో విద్యార్థులు చెల్లించేవారు. వాటిని పరిశీలించి మదింపు చేసేందుకు బోర్డుకు చాలా సమయం పట్టేది. ఈ ఏడాది ఆన్‌లైన్ విధానం తీసుకురావడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. ఇక ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షకు కూడా ఈసారి సాంకేతికతను వినియోగించారు. ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే మార్కులను బోర్డు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మార్కుల విషయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఎగ్జామినర్ రెండుసార్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

వ్యాపారి అనుమానాస్పద మృతి


మృతుడు మస్తాన్‌వలి

ధర్మవరం అర్బన్: స్థానిక సంజయ్‌నగర్‌లో ఓ గుజరీ వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... సంజయ్‌నగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి (48) గాంధీనగర్ సమీపంలో గుజరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లోనే బాత్‌రూంకు వెళ్లిన ఆయన ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భార్య పర్వీన్ వెళ్లి చూసింది. బాత్‌రూంలో విగతజీవిగా పడి ఉన్న భర్తను గమనించి కేకలు వేసి కుమారుడు షెక్షావలిని పిలిచి పరిశీలించారు. మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కోడ్ ఉంది... తస్మాత్ జాగ్రత్త

- హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రంగారెడ్డి ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిని కలెక్టర్ అరుణ్‌బాబు తీవ్రంగా పరిగణిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో రంగారెడ్డిని డీఈఓ మీనాక్షి సస్పెండ్ చేశారు.
- పెనుకొండ ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా–2గా పనిచేస్తున్న రామాంజినేయులు తన విధులకు హాజరు కాకుండా అనంతపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటప్రసాద్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ వచ్చారు. ఈ విషయాన్ని పసిగట్టిన అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఈ నెల 8న సస్పెండ్‌కు గురైన ఉపాధ్యాయుడు రంగారెడ్డి (వృత్తంలోని వ్యక్తి)

- ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి
- ఆధారాలతో పట్టుబడితే వేటు తప్పదు

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియామావళి (ఎన్నికల కోడ్)ని అధికార యంత్రాంగం పక్కాగా అమలు చేస్తోంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తోంది. ఏ మాత్రం పొరపాట్లకు తావిచ్చినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. పోటీలో ఉన్న అభ్యర్థులను కలవడం, వారు ఏర్పాటు చేసిన విందులకు హాజరవ్వడం వంటివి కోడ్ ఉల్లంఘన కిందకు తీసుకుంటున్నారు. వీటిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సస్పెన్షన్‌కు గురయ్యారు.

నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు..

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రజలను కలుస్తూ ప్రచారం చేయడంతో పాటు ఓటర్లకు దగ్గరయ్యేందుకు సమావేశాలు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఇలాంటి విందులకు ఉద్యోగులు వెళ్లినా బయటకు తెలిసేది కాదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత రోజుల్లో ప్రత్యర్థి శిబిరంలో ఏం జరుగుతుందో రాజకీయ నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు పసిగడుతున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉండడంతో ఎవరో ఒకరు ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తుండడంతో వాటిని ప్రత్యర్థులు పరిశీలించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలుంటే వెంటనే నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆ సమావేశాలు, విందులకు వెళితే అనవసరంగా ఇబ్బందుల్లో పడక తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిబంధనలు పాటించాలి..

ప్రతి ఉద్యోగి ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు స్పష్టం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ వేతనం పొందుతున్న వారందరూ నిబంధనల మేరకు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ప్రచారం చేయరాదన్నారు. ఆయా రాజకీయ పార్టీల సభలకు హాజరు కాకూడదన్నారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఏర్పాటు చేసిన విందులలో పాల్గొన్న ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. దగ్గరి బంధువు పోటీ చేస్తున్నా, కుటుంబ సభ్యులు ఉన్నా, స్నేహితులు పోటీ చేస్తున్నా సరే ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన


ఇంటి గోడకు బీజేపీ అభ్యర్థి స్టిక్కర్‌ను అతికించిన దృశ్యం

ధర్మవరం: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ప్రతి ఇంటికీ ఎన్డీఏ కూటమికి సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు సైతం స్టిక్కర్లను అతికించారు. ఇవన్నీ చూసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రవేశ పరీక్షకు హాల్‌టికెట్లు విడుదల

హిందూపురం టౌన్: సి.చెర్లోపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రవేశ పరీక్షకు హాజరు కావచ్చు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

గుత్తి రూరల్: బైక్‌ను ఢీకొని ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గుత్తి మండలం ఎంగిలిబండ శివారులో 67వ జాతీయ రహదారిపై ఈ నెల 10న చోటు చేసుకున్న ప్రమాదం తెలిసిందే. తాడిపత్రి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన అన్నదమ్ములు చంద్రశేఖర్ రెడ్డి(26), శివానందరెడ్డి(24)లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల తండ్రి రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు కారును నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై ప్రస్తుతం సెక్షన్ 304–ఏ కింద కేసు నమోదు చేశారు. అయితే ప్రమాద సమయంలో కారు నడిపిన వారు ఎవరనేది విచారణ చేసి, వారిపై పూర్తి స్థాయిలో కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో జూదరుల అరెస్ట్

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పెద్ద సంఖ్యలో జూదరులు పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు...

- **అగళి:** మండలంలోని కంబదపల్లి, హెచ్‌డీ హళ్లి గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతున్న 12 మందిని బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ వీరేష్ గురువారం వెల్లడించారు. జూదరుల నుంచి రూ.38,900 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.
- **రొళ్ల:** మండలంలోని ఎం.రాయాపురం గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న 11 మందిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.33 వేలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.
- **గుడిబండ:** మండలంలోని బైరేపల్లి, మోపురగుండు గ్రామ పొలిమేరలో గురువారం పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. నిందితుల నుంచి రూ.21వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత


మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల శివాలయం, పవర్‌స్టేషన్ వద్ద గురువారం ఉదయం సెబ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.లక్ష విలువ చేసే మద్యం పట్టుబడింది. మద్యం తరలిస్తున్న రాజు, ఆంజనేయులుని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ లలితాదేవి, ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. వీరి నుంచి 96 ప్యాకెట్ల కర్ణాటక మద్యం, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కనగానపల్లి మండలంలో చేపట్టిన తనిఖీల్లో ఎరికల రామగోవిందు, నరసింహులు పట్టుబడ్డారన్నారు. వీరి ఉంచి 720 కర్ణాటక టెట్రాప్యాకెట్ల మద్యం, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

హిందూపురం అర్బన్: స్థానిక పెన్నానది వంతెన సమీపంలో గురువారం రాత్రి సెబ్ అధికారుల చేపట్టిన తనిఖీల్లో హిందూపురానికి చెందిన వెంకటేష్ హోండా యాక్టివా వాహనంపై 9 బాక్సులు (864) కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు కమలాకర్, రామప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి


మృతురాలు రాధమ్మ

సోమందేపల్లి: మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద విద్యుత్ షాక్‌కు గురై స్థానికురాలు రాధమ్మ (35) మృతి చెందింది. గురువారం ఉదయం కాలనీలోని తమ ఇంటి సమీపంలో ఉన్న పంచాయతీ బోరు వద్ద వంట పాత్రలు కడుగుతుండగా దెబ్బతిన్న విద్యుత్ తీగ నుంచి కరెంటు సరఫరా అయి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య


మృతురాలు ఆదెమ్మ

నల్లచెరువు: జీవితంపై విరక్తితో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం దామవాండ్లపల్లికి చెందిన మల్లికార్జున బుధవారం తన భార్యతో కలసి సమీప బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు తిరిగి స్వగ్రామానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇంటి వద్ద ఉండాల్సిన తల్లి పూలకుంట ఆదెమ్మ (68) కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీశారు. చింత తోపు వైపు ఆమె వెళ్లినట్లుగా చూసిన వారు తెలపడంతో అటుగా వెళ్లి గాలింపు చేపట్టారు. అదే సమయంలో గ్రామానికి చెందిన కృష్ణమ్మ ఎదురుపడి ఆదెమ్మ చెప్పులు మాదిగోళ్ల బావి వద్ద ఉన్నాయని తెలపడంతో కుమారుడు అటుగా వెళ్లి పరిశీలించాడు. ఎక్కడేగాని ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అప్పటికే చీకటి పడడంతో ఇంటికి చేరుకున్న మల్లికార్జున గురువారం ఉదయం గ్రామస్తులతో కలసి మరోసారి బావి వద్దకు చేరుకున్నాడు. అప్పటికే బావిలో ఆదెమ్మ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. తన తల్లికి నెల రోజుల క్రితం కుక్క కరిచిందని, ఆపరేషన్ చేసి కుట్లు కూడా వేశారని ఈ సందర్భంగా మల్లికార్జున తెలిపాడు. అప్పటి నుంచి మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్న ఆమె జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లుగా చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న వాహనాలు

- రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలు స్వాధీనం
- పట్టుబడిన అన్నమయ్య జిల్లా వాసి
- ఉమ్మడి అనంత, వైఎస్సార్ జిల్లాలో పలు కేసులు

కదిరి టౌన్: ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కదిరి సీఐ పుల్లయ్య తెలిపారు. వివరాలను గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గత రెండు నెలలుగా కదిరి పట్టణంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలు జరిగాయి. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం కదిరి – రాయచోటి మార్గంలో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట గ్రామానికి చెందిన మామిళ్ల వీరారెడ్డిని ఆపి రికార్డుల కోసం ఆరా తీశారు. ఆ సమయంలో ఆయన తడబడడంతో అనుమానం వచ్చి అదుపులోకి తమదైన శైలిలో విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల చోరీల అంశం వెలుగులోకి వచ్చింది. వ్యసనాలకు బానిసగా మారాడు. తన జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలు అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కదిరి టౌన్, కదిరి రూరల్, గాండ్లపెంట, అనంతపురం, తాడిపత్రి, రాయచోటిలో 19 కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. గాండ్లపెంటలో 2, రాయచోటి 2, కదిరిలో 26 వాహనాలు అపహరించినట్లుగా విచారణలో తేలింది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీలత అభినందించారు.

విష పురుగు కుట్టి వృద్ధురాలి మృతి

యాడికి: విష పురుగు కుట్టడంతో యాడికి మండలం గుడిపాడుకు చెందిన దండు లక్షుమమ్మ (73) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... లక్షుమమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంటి ఆవరణలో పడుకున్న ఆమె... గురువారం తెల్లవారు జామున తనను ఏదో కుట్టినట్లుగా గుర్తించింది. అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయింది. ఉదయం నిద్ర లేచిన తర్వాత తల బరువుగా ఉంటూ కళ్లు కనపించకపోవడంతో విషయాన్ని కుమారులకు తెలిపింది. దీంతో పెద్ద కుమారుడు శ్రీరాములు వెంటనే ఆమెను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి పిలుచుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు విషపురుగు కుట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని గుర్తించి అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం ఆమె మృతి చెందింది. ఘటనపై రెండో కుమారుడు కంబగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

పండుగ పూట విషాదం

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- మసీదులో ప్రార్థనలకు వెళ్లిన సమయంలో ఘటన


మృతుడు లాల్‌బాషా

కణేకల్లు: రంజాన్ పండుగ ఓ ముస్లిం కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. గ్రామంలోని అందరూ రంజాన్ పండుగ జరుపుకుంటున్న వేళ నమాజ్ కోసం మసీదుకు వెళ్లిన ఓ వ్యక్తిని కరెంటు షాక్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు...

కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన డి.లాల్‌బాషా (32)కు నాలుగేళ్ల క్రితం అనంతపురానికి చెందిన వన్నూర్‌బీతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న లాల్‌బాషా... రంజాన్ మాసం ఆరంభం నుంచి తన విధులకు సెలవు పెట్టి ఉపవాసాలుంటూ ఐదుపూటల నమాజ్‌లో పాల్గొంటూ వచ్చారు. గురువారం పండుగ కావడంతో ఇంట్లో అందరితో కలసి సంతోషంగా గడిపారు. సాయంత్రం ప్రార్థనకు మసీదు వెళ్లిన లాల్‌బాషా వజూ (కాళ్లు, చేతులు శుభ్రం) చేసుకునేందుకు కొళాయి వద్దకెళ్లాడు. అప్పటికే తెగిపడిన విద్యుత్ సర్వీస్ వైరును గమనించకుండా తొక్కడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్నేహితుడు బాషా వెంటనే అతన్ని పక్కకు లాగాడు. ఆ సమయంలో బాషా కూడా షాక్‌కు గురైనా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న లాల్‌బాషాను స్థానికులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

26 వరకూ శ్రీరామ నవమి ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: ఈనెల 17 నుంచి 26 వరకూ భద్రాచలాన్ని తలపిస్తూ అనంత వేదికగా పది రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరుగనున్నాయి. గురువారం స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశీకులు రామసుబ్రహ్మణ్యంతో పాటూ ధర్మకర్తల మండలి సభ్యులు నీలూరి సురేష్, సుబ్రహ్మణ్యం, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కిషోర్ తదితరులు ఉత్సవ వివరాలను తెలియజేశారు. నగర వీధుల్లో రోజూ సీతారాములు వివిధ వాహన సేవలతో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 22న ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం, 24న శ్రీరాముడి పట్టాభిషేకం జరుగుతాయి.

రామగిరి మండలంలో టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: పాతికేళ్లుగా అధికారంలో ఉండి పేదలు, బడుగుల సంక్షేమాన్ని విస్మరించిన పరిటాల కుటుంబం వైఖరితో విసుగు చెంది రామగిరి మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీకిలో చేరారు. కంచుకుంట, కానుగులకుంట గ్రామాలకు చెందిన మాధవరెడ్డి, నాగరాజు, రంగయ్య, ముత్యాలప్ప, హరి, వీరన్న, రంగనాథ్, శివ, అంజన్‌రెడ్డితో పాటు మొత్తం 20 కుటుంబాలు గురువారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. చెన్నేకొత్తపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేవలం టీడీపీ మాది అనే సామాజిక వర్గానికి వారికి మాత్రమే పెద్దపీట వేస్తూ మిగిలిన సామాజిక వర్గాలను అన్ని విధాలుగా పరిటాల కుటుంబం అణచి వేసిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమనే విషయం ఈ ఐదేళ్లలో నిరూపితమైందని, దీంతో తామంతా వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రామగిరి ఎంపీపీ మీనుగ నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, జెడ్పీటీసీ నాగార్జున, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లంకాదహనం

- కసాపురంలో ముగిసిన ఉగాది ఉత్సవాలు


ఆంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో 3 రోజులుగా సాగుతున్న ఉగాది ఉత్సవాలు గురువారం లంకాదహనం కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. లంకాదహనం వేడుకను వీక్షించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆంజనేయస్వామిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి కాశీవిశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వరుడితో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. వేదగోష్టి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి చేతుల మీదుగా లంకా దహనం వేడుక ప్రారంభించారు. అయ్యప్ప క్రాకర్స్ వారు అందించిన టపాసులతో దాదాపు రెండు గంటలపాటు లంకా దహనం సాగింది.


లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ భద్రాజీ, సిబ్బంది